## క్లుప్తంగా

### డిమాండ్లు పరిష్కరించండి



మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్లకు మద్దతు తెలుపుతున్న సూర్యనారాయణమూర్తి

**అమలాపురం టౌన్:** మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణ మూర్తి డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట తమ డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ల శిబిరాన్ని ఆయన శుక్రవారం సందర్శించి మద్దతు తెలిపారు. చాలీచాలని జీతాలతో ఉద్యోగాలు చేస్తూ కుటుంబాలను పోషిస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం స్పందించాలని సూచించారు. టెక్నికల్ ఉద్యోగులకు రూ.29,200, నాన్ టెక్నికల్ ఉద్యోగులకు రూ.24,500 చొప్పున జీతాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా మున్సిపాలిటీల వద్ద చేస్తున్న సమ్మెకు, నిరసన శిబిరాలకు ఆయన సంఘీభావం ప్రకటించారు.

### చంద్రబాబు పర్యటనను బహిష్కరించండి



ఎస్.కొత్తపల్లిలో మాట్లాడుతున్న మాల జేఏసీ నాయకులు

**ఉప్పలగుప్తం:** ముమ్మిడివరం నియోజకవర్గం చెయ్యేరులో శనివారం జరగనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సభను కూటమి ప్రభుత్వంలో ఉన్న టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు బహిష్కరించాలని మాల మహానాడు జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధి నల్లావారి పేట మాల మహానాడు మండల అధ్యక్షుడు కొంకి వెంకటబాబ్జి అధ్యక్షతన జేఏసీ నాయకులంతా శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాల సామాజిక వర్గంపై కక్షతో తప్పుడు లెక్కలతో ఎస్సీ వర్గీకరణ చేసిందన్నారు. షెడ్యూల్ కులాల వర్గీకరణకు చంద్రబాబు అనుకూలంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ సీఎం సభను బహిష్కరించాలని వారు కోరారు. సమావేశంలో జల్లి శ్రీనివాసరావు, నాతి శ్రీనివాసరావు, కుంచే బాబులు, పులపర్తి వెంకటేశ్వరరావు, గిడ్ల రమేష్, గోసంగి తాతాజీ, నల్లా రవికుమార్, దోనిపాటి సతీష్, మాదే పండు, కుంచే వినాయకరావు, నల్లా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### పైపులైన్‌కు శంకుస్థాపన



రెడ్డిపల్లిలో తాగునీటి పైపులైన్‌కు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ప్రసన్న

**అమలాపురం రూరల్:** రెడ్డిపల్లి గ్రామంలో రూ. 4 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుకు శుక్రవారం సర్పంచ్ కరాటం ప్రసన్న ప్రవీణ్ శంకుస్థాపన చేశారు. అదేవిధంగా త్వరలో రూ.15 లక్షలతో వంతెన పనులకు శంకుస్థాపన చేస్తామని సర్పంచ్ వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు సత్తి ఆదిలక్ష్మి, మాజీ సర్పంచ్ కరాటం సూర్య భాస్కరరావు, కార్యదర్శి గణపతి, సచివాలయ కార్యదర్శులు గుత్తుల పార్థు, నెల్లి వెంకటలక్ష్మి, నల్లా సతీష్, రేలంగి నారాయణరావు, రాజులపూడి మహేష్ పాల్గొన్నారు.

# పెంట కాలువలు

- క్లోజర్ సమయంలో కానరాని పనులు
- ఎక్కడికక్కడే కాలువల్లో పూడికలు
- పట్టించుకోని అధికారులు



ఉప్పలగుప్తం మండలంలో చెత్తాచెదారంతో నిండిన విలసవిల్లి-చెయ్యేరు పంట కాలువ



అధ్వానంగా ఉన్న మురమళ్ల- ఎదుర్లంక ప్రధాన పంట కాలువ

**ఐ.పోలవరం:** కాలువల్లో అడుగడుగునా ఆటంకాలు.. ముందుకు కదలని జలాలు.. ఎక్కడికక్కడే చెత్తాచెదారాలు.. తూటుకాడతో తిప్పలు.. ఇలా పంట కాలువలు ఉన్నాయి. గోదావరి మధ్య డెల్టాలో అత్యధికంగా ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల్లోనే ఖరీఫ్ వరి సాగు జరుగుతోంది. ఈ నియోజకవర్గాల పరిధిలో సుమారు 52 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతుందని అంచనా. ఇందులో ముమ్మడివరం నియోజకవర్గంలో తాళ్లరేవు, ఐ.పోలవరం, కాట్రేనికోన, ముమ్మిడివరం మండలాల్లో సుమారు 32 వేల ఎకరాలు ఉండగా.. అమలాపురం నియోజకవర్గంలో ఉప్పలగుప్తం, అమలాపురం, అల్లవరం మండలాల్లో 20 వేల ఎకరాలు ఉంది. అంతేకాకుండా ఏటా ఖరీఫ్ ముంపు బారిన పడి పంట నష్టపోతున్నామనే భయంతో తొలి పంట వేయని రైతులు కూడా ఈ నియోజకవర్గాల్లోనే ఉన్నారు. అటువంటి చోట రైతులు ఖరీఫ్‌కు సిద్ధమవుతున్నారంటే అటు వ్యవసాయ శాఖ, ఇటు నీటిపారుదల శాఖ అధికారులు పక్కా ప్రణాళికతో సాగాల్సి ఉంది. కాలువలకు నీటి విడుదలను నిలిపివేసిన నేపథ్యంలో కాలువల మరమ్మతులను చేయాల్సి ఉంది. ఈ క్లోజర్ పనులను అధికారులు గాలికి వదిలేశారు.

**పనులు చేయక..**

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ఆయకట్టుకు నాలుగు ప్రధాన పంట కాలువల ద్వారా సాగునీరు అందుతోంది. తూర్పు డెల్టా పరిధిలోని తాళ్లరేవుకు కోరంగి కాలువ ద్వారా, మధ్య డెల్టాలో ఐ.పోలవరం, ముమ్మిడివరం, ఉప్పలగుప్తం మండలాలకు ముక్తేశ్వరం బ్యాంకు కెనాల్ ద్వారా, ఉప్పలగుప్తం, అమలాపురం, అల్లవరం మండలాలకు అమలాపురం కాలువ, బెండ కెనాల్ ద్వారా సాగునీరు అందుతుంది. కాలువలకు నీటి విడుదల ఆపేసిన సమయంలో చానల్స్, పంట బోదెలపై పెద్దగా పనులు చేయలేదు. చేసినచోట కూడా అరకొరగానే పనులు చేశారు. కాలువల్లో పూడికతీత, గుర్రపు డెక్క, తూడుకాడ తొలగింపు వంటి చిన్న చిన్న పనులు కూడా చేయలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కొన్నిచోట్ల ఉపాధి కూలీలతో మొక్కుబడిగా పనులు చేశారే తప్ప సాగుకు ఉపయోగపడే రీతిలో చేయడం లేదని, కొన్నిచోట్ల ఎక్కడి చెత్త అక్కడే వదిలేస్తున్నారని రైతులు వాపోతున్నారు. దెబ్బతిన్న డైరెక్ట్ పైపు (డీపీ)లు, తుప్పు పట్టిన షట్టర్లు, ఊడిపోతున్న చిన్న లాకు గేట్లు, రెగ్యులేటర్లను బాగుచేసే పనులనూ అధికారులు పట్టించుకోలేదు.

**శివారు ఆయకట్టు ఎక్కువే..**

రెండు నియోజకవర్గాల్లో ప్రధాన పంట కాలువల్లో శివారు ఆయకట్టు అధికంగా ఉంది. ఐ.పోలవరం మండలం కేశనకుర్రు, ఎదురులంక గుత్తెనదీవి, ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లి, రాఘవులపేట అల్లవరం మండలం సామంతకుర్రు, బెండమూరలంక, కొమరగిరిపట్నం వంటి ప్రాంతాలు ధవళేశ్వరం బ్యారేజ్‌కు 60 కిలోమీటర్ల నుంచి 80 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఇక్కడకు సాగునీరు అందాలంటే లొల్ల లాకుల నుంచి శివారు వరకూ పంట కాలువలు పూడిక లేకుండా ఉండాలి. కానీ ప్రధాన పంట కాలువ నుంచి శివారు పంట బోదెలు వరకూ అధ్వానంగా ఉండటంతో ఖరీఫ్‌లో సైతం సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. త్వరలోనే పంట కాలువలకు నీటిని విడుదల చేయనున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంట కాలువలను బాగు చేయించాలని రైతులు కోరుతున్నారు.

**అధికారులు దృష్టి సారించాలి**

మరో పది రోజుల్లో కాలువలకు నీటిని విడుదల చేస్తారు. ఇప్పుడు కాలువల్లో ఎక్కడికక్కడే చెత్తా చెదారం ఉంది. మొక్కుబడిగా ఉపాధి పనులు సాగుతున్నాయి. అధ్వానంగా మారిన పంట కాలువలను బాగుచేయకపోతే ఖరీఫ్‌లో నానా అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తోంది.

– ఎం.మోహన్‌రావు, రైతు, జి.వేమవరం, ఐ.పోలవరం మండలం

### హడలెత్తించిన తాచుపాము



తాచుపామును బంధించిన గణేష్‌వర్మ

**ముమ్మిడివరం:** అయినాపురంలోని ఓ ఇంట్లో తాచుపాము హడలెత్తించింది. గ్రామానికి చెందిన సుదర్శనం వెంకటరామాచారి ఇంట్లో నాలుగు రోజులుగా సన్‌షేడ్‌పై తాచుపాము ఉంది. దీంతో వెంకటరమాచారి కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురై ఉప్పలగుప్తం మండలం భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేశ్ వర్మకు సమాచారం ఇవ్వడంతో అతను వచ్చి పామును పట్టుకుని ప్లాస్టిక్ డబ్బాలో బంధించడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**యానాం:** పుదుచ్చేరి వ్యాప్తంగా దివ్యాంగ విద్యార్థులకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు నిర్వహించే పోటీ పరీక్షలకు ఒక ఏడాది పాటు శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులను కోరుతున్నామని శుక్రవారం పుదుచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ పబ్లిక్ రిలేషన్స్ విభాగం ఓ ప్రకటన విడుదల చేసింది. ఏడాది పాటు ఇచ్చే శిక్షణను పుదుచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ, కేంద్ర న్యాయ, చట్ట వ్యవహారాల విభాగం, డెవలప్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబిలిటీస్ శాఖ సంయుక్తంగా ఇస్తుందన్నారు. అభ్యర్థులు డిగ్రీ పూర్తి చేసి 20–41 సంవత్సరాల మధ్య ఉండాలని, జూన్ 10లోగా ఆన్‌లైన్ ద్వారా యూనివర్సిటీ ఎగ్జామినేషన్స్ ట్రైనింగ్ సెల్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

### కొత్త విలువల ఆధారంగా రిజిస్ట్రేషన్

**యానాం:** యానాం తదితర రీజియన్లలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నూతన గైడ్‌లైన్ రిజిష్టర్ (జీఎల్ఆర్) విలువల సవరణ పోర్టల్‌ను నవీకరిస్తున్న నేపథ్యంలో కొత్త విలువలతో రిజిస్ట్రేషన్లు చేయాలని శుక్రవారం సబ్ రిజిస్ట్రార్‌కు పుదుచ్చేరి రిజిస్ట్రార్ దయాళనే ఆదేశాలు జారీ చేశారు. మే 21 నుంచి అమలులోకి వచ్చేలా కొత్తగా నిర్ణయించిన సీఎల్ఆర్ విలువల ఆధారంగా మాత్రమే పత్రాల రిజిస్ట్రేషన్లు నిర్వహించాలని ఆదేశించారు.

### విధి నిర్వహణలో సేవలతో గుర్తింపు



కృష్ణమూర్తి దంపతులను సత్కరిస్తున్న డీటీ వెంకటేశ్వరరావు

**యానాం:** ఉద్యోగ జీవితంలో నిస్వార్థ సేవలు అందించిన వారికి ప్రజల నుంచి గుర్తింపు లభిస్తుందని డిప్యూటీ తాహసీల్దార్ జ్యోతి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎంటీఎస్ (జనరల్) ఉద్యోగిగా సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన విత్తనాల కృష్ణమూర్తిని సత్కరించారు. అలాగే యానాం పబ్లిక్ వర్క్స్ శాఖలో రోరల్ డ్రైవర్‌గా సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన మట్టపర్తి సత్యనారాయణను సిబ్బంది ఘనంగా సత్కరించారు.

## చట్టాలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న వాసంశెట్టి సందివర్ధిని

**తాళ్లరేవు:** మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని భీమాబాయి మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి సందివర్ధిని తెలిపారు. మండలి ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో శుక్రవారం గృహహింస, నిర్భయ చట్టం, దిశ, బాల్య వివాహ నిరోధక చట్టాలపై సమాఖ్య సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, మహిళా మండలి ఉమెన్ ప్రోగ్రామ్ ఆర్గనైజర్ ఝాన్సీ మాట్లాడుతూ బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో భీమాబాయి మహిళా మండలి సిబ్బంది, గ్రామ సమాఖ్య సభ్యులు, యూత్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

**అమలాపురం రూరల్:** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే యోగాంధ్ర కార్యక్రమ లక్ష్యమని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. శుక్రవారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో ఎంపీడీఓలతో సమావేశం నిర్వహించారు. గ్రామ, మండల స్థాయిల్లో యోగాంధ్రకు సంబంధించి రిజిస్ట్రేషన్లు, శిక్షణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లాలో 8 లక్షల మందిని నమోదు చేసి యోగాభ్యసన కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. దీని ప్రకారం ప్రతి మండలంలో 40 వేల మంది చొప్పున నమోదు చేయాలని ఆదేశించారు. దీనికోసం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలన్నారు. జూన్ 3న అంతర్వేది బీచ్‌లో సుమారు 2 వేల మందితో యోగాభ్యసన కార్యక్రమం నిర్వహించాలన్నారు. జూన్ 9న ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయం వద్ద, 16న వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద గ్రాండ్ ఈవెంట్‌ను నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి, డీఎల్‌డీఓ రాజేశ్వరరావు, డ్వామా పథక సంచాలకుడు ఎస్.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## వేతనాల విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యం



పేరూరులో ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న వెంకటేశ్వరరావు

**అమలాపురం రూరల్:** ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిల విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు అన్నారు. తక్షణం నిధులు విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం గున్నేపల్లిలో జరిగే బహిరంగ సభలో సీఎం చంద్రబాబును కలసి వినతి పత్రం అందిస్తామని ఆయన తెలిపారు. అమలాపురం మండలం పేరూరు గ్రామంలో శుక్రవారం ఉపాధి కూలీల సమస్యలను వెంకటేశ్వరరావు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతన బకాయిలు విడుదల కాక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తున్నాయన్నారు. ఇందులో భాగంగా ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు ఇవ్వకుండా కూలీల నోటితోనే ఈ పథకం మాకు వద్దని చెప్పించే ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. జిల్లాలో సుమారు రూ. 60 కోట్ల వేతన బకాయిలు విడుదల చేయకుండా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. పనులు లేని కాలంలో వ్యవసాయ కార్మికులకు ఆరు నెలల పాటు రూ. 6 వేలు ప్రతి కుటుంబానికి ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, అది నేటికీ ఆచరణకు నోచుకోలేదని విమర్శించారు. జిల్లా నాయకుడు పి.శివ, మేట్లు జల్లి సీతామహాలక్ష్మి, జల్లి దుర్గాభవాని, గుబ్బల పార్వతి, ఎస్.నాగరాజు ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన



చెరువులో పూడికతీత పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు

**తాళ్లరేవు:** సుంకరపాలెం పంచాయతీ పరిధిలో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పనులను శుక్రవారం సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంచినీటి చెరువులో 215 మంది పూడికతీత పనులు చేస్తున్నట్లు ఫీల్డ్ అసిస్టెంట్ సర్పంచ్‌కు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో రైతులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు చేస్తున్నామన్నారు.

### హౌసింగ్ స్కీమ్‌కు దరఖాస్తుల విడుదల

**యానాం:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించి దరఖాస్తులను శుక్రవారం పుదుచ్చేరి సీఎం రంగసామి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుదుచ్చేరి ప్రభుత్వం హౌసింగ్ కన్‌స్ట్రక్షన్ స్కీమ్‌ను 2003 నుంచి అమలు చేస్తుందన్నారు. ఈ పథకం ద్వారా ఈడబ్ల్యూఎస్ వారికి రూ.5 లక్షలు ఇళ్ల నిర్మాణాలకు ఇస్తుందన్నారు. దరఖాస్తులను అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

### బెల్లపు ఊట ధ్వంసం

**కొత్తపేట:** ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో శుక్రవారం 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. అమలాపురం ఏఈఎస్ జి.అమర్‌బాబు ఆధ్వర్యంలో ఆత్రేయపురం మండలం పేరవరం సమీపంలోని గోదావరి లంకలో సారా తయారీకి వాడే బెల్లపు ఊట నిల్వ ఉంచిన ప్లాస్టిక్ పీపాలను గుర్తించారు. వాటిని వెలికితీసి, ఊటను ధ్వంసం చేశారు. దీనికి సంబంధించి అదే గ్రామానికి చెందిన బెజవాడ సత్తియ్యపై కేసు నమోదు చేశారు. దాడుల్లో సీఐ కె.చంద్రశేఖర్, ఎస్సై కె.అన్నవరం (కొత్తపేట), కె.సుబ్బారావు (రామచంద్రపురం), సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వీరేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



వీరేశ్వరస్వామికి అన్నాభిషేకం చేస్తున్న అర్చకులు

**ఐ.పోలవరం:** మండలంలోని సుంకరపాలెంలో కొలువైన భద్రకాళీ వీరేశ్వరస్వామివారి ఆలయ 13వ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. స్వామివారికి ఆలయ అర్చకుడు శ్రీకంఠం గిరిబాబు శర్మ పంచామృతాభిషేకాలు, అన్నాభిషేకం తదితర పూజలు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సేవలందించారు.









## భవనం ప్రారంభం ఎప్పుడో?



అమలాపురం వడ్డిగూడెంలో నిరుపయోగంగా ఉన్న అగ్నిమాపక కేంద్ర భవనం

**అమలాపురం టౌన్:** అమలాపురం నల్ల వంతెన వద్ద ఉన్న అగ్నిమాపక కేంద్ర భవనాన్ని జిల్లా కేంద్ర కార్యాలయ భవనంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో స్థానిక వడ్డిగూడెంలోని ప్రభుత్వ బాలికల హాస్టల్‌కు వెనుక స్థలంలో రూ.70 లక్షలతో నాలుగేళ్ల కిందట నిర్మించిన నూతన అగ్నిమాపక కేంద్ర భవనాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారనే ప్రశ్న ప్రజలు నుంచి వినిపిస్తోంది. గత ప్రభుత్వంలో సువిశాల ప్రాంతంలో దాదాపు అర ఎకరం స్థలంలో రూ.70 లక్షలతో అన్ని అధునాత వసతులతో ఈ భవనం నిర్మించింది. అప్పట్లో భవనాన్ని నిర్మించినా దాని చుట్టూ ఉన్న స్థలంలో ఎర్త్ వర్క్ చేయలేదన్న కారణంతో ప్రారంభించలేదు. ఈలోగా సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఆ జాప్యం అలాగే కొనసాగింది. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా పూర్తయిన అగ్నిమాపక కేంద్ర భవనాన్ని ప్రారంభించే విషయంపై చొరవ చూపలేకపోయింది. గతంలోనే భవనం ఉన్న స్థలం చుట్టూ ఎర్త్‌వర్క్ పూర్తయ్యింది. ఇప్పుడు ఆ భవనాన్ని ప్రారంభించేందుకు అన్ని హంగులు సిద్ధంగా ఉన్నాయి. కాకపోతే ప్రభుత్వ హాస్టల్ పక్క నుంచి అగ్నిమాపక శకటం వెళ్లి వచ్చేలా రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రారంభించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. తాజాగా భవనానికి పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు మరో రూ.27 లక్షలను అగ్నిమాపక శాఖ మంజూరు చేసిందని, త్వరలోనే టెండర్లు పిలిచి పనులు చేపడతారని అధికారులు చెబుతున్నారు.

**ఇక్కడైతే ఇబ్బందులే..**

స్థానిక నల్ల వంతెన దిగువన ఎక్సైజ్ స్టేషన్‌కు ఎదురుగా పల్లపు ప్రాంతంలోని ఓ గొయ్యిలో ఉన్న భావనతో అగ్నిమాపక కేంద్ర భవనం ఉంది. అగ్ని ప్రమాదాలు అంటేనే అత్యవసర సేవలతో ముడిపడి ఉంటుంది. ఏదైనా అగ్ని ప్రమాద వార్తను (ఫోన్ కాల్ ద్వారా) తెలుసుకుని అగ్నిమాపక శకటాన్ని ఆ పల్లపు ప్రాంతంలోంచి నల్ల వంతెన అప్రోచ్ రోడ్డు ఎక్కి అక్కడ నుంచి వంతెన వైపు ఎత్తు రోడ్డు జాగ్రత్తగా వాహనం ఎక్కేసరికి పుణ్యకాలం కాస్తా ఇక్కడే అయిపోతోంది. ఈ అసౌకర్యాలను దృష్టిలో పెట్టుకునే దూరదృష్టితో గత ప్రభుత్వంలో వడ్డిగూడెం రోడ్డులో సువిశాల భవనం నిర్మించారు.

**టెండర్లకు సన్నాహాలు**

అమలాపురం వడ్డిగూడెంలోని నూతన అగ్నిమాపక కేంద్ర భవనానికి అవసరమైన అదనపు పనులకు త్వరలోనే టెండర్లు పిలిచి చేపట్టనున్నారని అమలాపురం అగ్నిమాపక దళాధికారి కేవీ మురళీ కొండబాబు తెలిపారు. పోలీస్ గృహ నిర్మాణ మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా ఈ పనులు చేపడతారన్నారు.